# తమ్ముడూ - ప్రణ(ళ)యాంబోధి

"అక్కయ్యా ! సుశీలక్కయ్యా !" శేఖర్ వరండాలోంచి గావు కేకలు పెడ్తున్నాడు. వంటింట్లో పనిచూసుకుంటున్న నాకు గాభరా వేసింది. పోస్టుమ్యాన్ ఏవో ఉత్తరాలు ఇచ్చి వెళ్తున్నట్లున్నాడు. కంగారుగా హాల్లోకి వచ్చాను.

"ఏమిటి శేఖర్ ? ఏమయింది తమ్ముడూ !" నా ఆదుర్దా ఎంతగా అణుచుకోవాలన్నా అణగలేదు.

"ఇలా చూడు" కవరు నా చేతికిచ్చాడు సంతోషంతో కాబోలు, శేఖర్‌కు మాటలు దొర్లటంలేదు.

"ఇది నీకు అడ్రస్ చేయబడింది తమ్ముడూ!" అన్నాను కవరుమీది అడ్రస్ చూచి అయోమయంగా.

"పర్వాలేదు, నువ్వు చదవటానికే ఇచ్చాను !" ఆ గొంతులో గర్వం ధ్వనిస్తోంది.

"చదువక్కయ్యా!" ప్రాధేయపడ్తున్నట్లు అంటున్నాడు శేఖర్.

"శేఖర్ గారికి,

నమస్కారం.

మీ ఉత్తరం అందింది. మీరు నన్నింతగా అభిమానిస్తున్నందుకు చాల సంతోషం! నిజానికి మీలాంటి సహృదయులైన ప్రేక్షకుల ఆదరాభిమానాలె, నాకూ, నా కళకూ, నా తారా పథానికీ సోపానాలు !

ఎక్కువగా వ్రాయటానికి టైం లేదు. షూటింగుకు వెళ్ళాలి. మీరు కోరినట్లు నా ఫోటో పంపిస్తున్నాను. వీలైనప్పుడల్లా మీ ఉత్తరాలకు తప్పక జవాబిస్తాను. ఇక వుంటా.

"తార"

కార్డుసైజు ఫోటో, ఓ సినిమా తారది ! ఆ చిన్న ఉత్తరమూ! తలెత్తి తమ్ముడివైపు చూశాను. టెరిలిన్ షర్ట్ కాలర్ ఎత్తుగా చేసి, ఘన విజయం సాధించినవాడిలా రుమాలుతో ముఖం తుడుచుకుంటున్నాడు.

"నువ్వావిడకు ఉత్తరం వ్రాశావా ?" అన్నాను కవరు తమ్ముడి చేతికిస్తూ.

"ఆఁ ! అసలేం జరిగిందో తెలుసా అక్కయ్యా ? పది రోజుల క్రితం మా ఫ్రెండ్స్ నాతో పందెం కాసారు. ఫలానా సినీతార వుత్తరం వ్రాస్తే జవాబివ్వదోయ్ ! అని !

చూచుకో మన తడాఖా! జవాబుతో పాటు ఫోటో కూడా తెప్పించాను !" కవరు పాంటు జేబులో పెట్టుకున్నాడు

ఏదో అనబోయేంతలోనే తమ్ముడు హుషారుగా "అక్కయ్యా ! కాలేజి టైం అయ్యింది. మరి నేను వెళ్లొస్తా!" అంటూనే చకచకా వెళ్ళిపోయాడు.

వంటింట్లోకి వచ్చాను. కుంపటిమీద పప్పు కుతకుత ఉడుకుతోంది. తమ్ముణ్ణిగురించిన ఆలోచనలు ఈగల్లా ముసురుకున్నాయి చుట్టూరా!

నిజానికి శేఖర్‌కూ మాకూమధ్య ఏలాటి బంధుత్వమూ లేదు. శేఖర్ తల్లిదండ్రులు గ్రామంలో ఉంటున్నారు. శేఖర్ నాన్నగారు గోపాలయ్యగారు, శేఖర్‌ను కాలేజిలో చేర్చి, కాస్త చదువూ, సంస్కారమూ వున్న పరిచయస్తుల ఇళ్ళలో ఏదైనా రూం దొరుకుతుందేమోననే ఆశతో, నానా యాతన పడ్డి, మా మేడమీద గది ఖాళీగా వుందని తెలిసి తిన్నగా మా శ్రీవారి దగ్గరకు వచ్చారు. ముందస్తుగా, కాలేజీ కుర్రాడికి రూం ఇవ్వటానికి వెనకంజ వేశాం నేనూ, శ్రీవారూ! కానీ శేఖర్‌ను చూచాక మాకేమి భయం లేదనిపించింది.

సన్నగా, పొడుగ్గా వుండే పద్ధెనిమిదేళ్ళ శేఖర్ ముఖంలో నాకు కనిపించిందల్లా, పసిపిల్లల అమాయకత్వం మాత్రమే! ''షోకిలా'' లక్షణాలు సెర్చిలైటు వేసినా కనిపించవు.

ఆరోజే శేఖర్ మాయింటో ఒకడుగా మారిపోయాడు.

రెండు రోజులుండి గోపాలయ్యగారు వెళ్ళిపోయారు. ప్రయాణమై వెళ్ళేముందు, ఆయనగారు నాకూ, శ్రీవారికీ పదేపదే చెప్పినమాట లివి :

''నాయనా కృష్ణమూర్తి. అమ్మాయ్ సుశీలా! మీ రే వాడి కిక పెద్దదిక్కు, మీ బిడ్డలా భావించి, వాడికి మంచి చెడ్డలు చెప్పండి! బొత్తుగా అమాయకుడు! ఒక్కగానొక్క

పిల్లవాడు! చెడు సహవాసాలకు, చెడ్డ అలవాట్లకూ దిగకుండా, కాస్త కనిపెట్టి వుండండి! ఒక వేళ అలాటి అనుమానమే దేనా వస్తే, నిస్సంకోచంగా మందలించండి! దండించండి! నేనేమీ అనుకోను అప్పుడప్పుడూ మావాడి నడవడికను గురించి నాకు ఉత్తరాలు వ్రాస్తూండండి. మిమ్మల్నిద్దర్నీ చూచాక, ఇక నాకు వాణ్ణిగురించిన బెంగ ఎగిరిపోయింది! ఇక మీయిష్టం."

బస్తీలో, కాలేజీ చదువుకోసం అడుగెట్టిన తన ఒక్కగానొక్క పిల్లాడూ, ఏ ఆకతాయిగా మారుతాడోనని పాపం! ఆ పల్లెటూరితండ్రి భయం!

"మరేం భయంలేదు మామయ్యగారూ! శేఖర్‌ను గురించి ఏలాటి బెంగా పెట్టుకోకండి!" శ్రీవారు భరోసా ఇచ్చారు.

"మరి వెళ్ళిరానా అమ్మా?" అన్నారాయన.

"మంచిది బాబాయిగారూ! శేఖర్ నా తమ్ముడే అనుకోండి" అన్నాను.

కృతజ్ఞతా పూర్వకంగా మా యిద్దరి వేపూ చూచి, వెళ్ళిపోయారాయన.

పది పదిహేను రోజులు తిరిగే సరికి శేఖర్‌కు బెరుకూ, భయమూ తీరి నాతో, శ్రీవారితో బాగా చనువుగా మాట్లాడుతూ మా యింట్లో మనిషిగా మారిపోయాడు!

అయితే, హోటల్లోనే భోజనం చేస్తాడు! రూంబాడుగ ఇస్తాడు! "అక్కయ్యా! బావగారూ!" అంటాడు మమ్మల్ని నోరారా!

అప్పుడప్పుడూ గోపాలయ్యగారు ఉత్తరాలు వ్రాస్తుంటారు నాకు, శ్రీవారికి కొడుకు విషయమై.

ఏలాటి బెంగా లేదని జవాబిస్తుంటాం!

పి. యు. సి. పాసైనాడు శేఖర్. బి. ఎస్. సి. లో చేరాడు.

* * *

"సుశీ! ఏదో మాడుతోన్న వాసన వేస్తోంది."

శ్రీవారు వంటింట్లోకి హడావుడిగా వస్తూ అంటున్న మాటలతో నా ఆలోచనాస్రవంతికి అడుకట్ట పడింది.

పప్పులో నీళ్ళు ఇగిరి కొద్దిగా మాడు వాసన వేస్తోంది! పప్పుగిన్నె దించాను.

ఈ రోజేమిటో మనస్సు కలుక్కుమంది! ఆడపిల్లలతో చనువుగా ప్రవర్తించని శేఖర్ సినీతారకు ఉత్తరం ఎందుకు వ్రాశాడు! కేవలం స్నేహితుల ప్రోద్బలమే ననుకున్నా, జవాబు చూచి, అతగాడి ముఖంలో అశాంతి ఏమిటి?

శేఖర్ చల్లగా క్రిందికి జారుతున్నాడా?

"ఏమిటి సుశీ! అలా ఉన్నావ్?"

వంటింటి గుమ్మంలో పీట వాల్చుకూర్చుంటూ అడిగారు శ్రీవారు!

"శేఖర్ చూశారా ఎంతపని చేసేడో?" అన్నాను.

"ఏం చేశాడు? యధాలాపంగా అడిగారు.

"సినిమాతార "తార"కు ఉత్తరం వ్రాసి, జవాబూ, ఆవిడ ఫోటో తెప్పించుకున్నాడు !"

శ్రీవారు ఇల్లెగిరిపోయేలా నవ్వారు,

"ఓస్ ఇంతేనా ? మరేం చేశాడోనని గాభరాపడి పోయాను !"

"అంటే! అది తప్పుగాదా ?" అన్నాను కోపంగా.

"డియర్ సుశీలా! సహజంగా యీ వయసులో కుర్రాళ్ళకి అలాటి గ్లామర్ వుంటుంది. అదేదో పెద్ద చెయ్యరాని తప్పుని నువ్విలా కంగారు పడటం చూస్తుంటే, నాకు నవ్వొస్తోంది !"

నాకు తగని చిరాకు వేసింది. అసలీ మగాళ్ళంతా ఇంతే కాబోలు! కొంపలంటుకుంటున్నా. తాపీగా చూస్తూ కూర్చుంటారు! ఈ రోజు ఉత్తరం వ్రాశాడు! రేపు ప్రేమించానంటాడు! ఎల్లుండి ఆవిడను పెళ్ళాడందే బ్రతకలేనంటాడు! అప్పుడేం చెయ్యాలి ?

గోపాలయ్య బాబాయిగారు అనాడు వచ్చి.

"ఏమమ్మా సుశీలా ? నమ్మి మీ దగ్గర వదిలితే, తెలిసీ మందలించకుండా మీ రెలా వూరుకున్నారు ?" అంటే ఆయనగారి ముఖం ఎలా చూడాలి నేను ? ఆమాటే అన్నాను శ్రీవారితో !

మళ్ళీ ఆ నవ్వే సమాధానంగా వచ్చింది !

ఉక్రోషం ముంచుకు వచ్చింది నాకు. "ఎందుకలా నవ్వుతారు? వాడు తప్పుదారిన పోతుంటే మందలించాల్సిన బాధ్యత మనకు లేదా? ఇదే మీ స్వంత తమ్ముడో, బావ మరిదో అయితే ఇలాగే నవ్వుతారా?"

"సుశీ!" శ్రీవారు లేచి నిల్చున్నారు! అంటే కాలేజీకి బయల్దేరారన్నమాటే!

"శేఖర్ నువ్వనుకుంటున్నంత పసిబిడ్డేం కాదు! మనం మందలించడంకంటే, అతగాణ్ణే తెలుసుకోనీ!"

ఇక వాదనకు అవకాశం యివ్వకుండా వెళ్ళిపోయారు!

మూడు నెలలు జరిగిపోయాయి! ఒకరోజు శేఖర్, గబగబా సూట్‌కేస్, హోల్డాల్ సర్దేస్తున్నాడు.

"ఎక్కడికి తమ్ముడూ ప్రయాణము?" అన్నాను కుతూహలం అణచుకోలేక... "మొన్ననేగా శెలవులకు మీ వూరు వెళ్ళొచ్చావూ!" అనికూడా అన్నాను ఉండబట్టలేక.

"మద్రాస్ అక్కయ్యా! మా కాలేజీ కుఱ్ఱాళ్ళం 'కల్చరల్ టూర్' వేసుకున్నాం!" శేఖర్ వెళ్ళిపోయాడు.

శ్రీవారిని అడిగాను సాయంత్రం :

"నిజంగా శేఖర్ ఆ 'కల్చరల్ టూర్'కేనా వెళ్ళేది! లేక ఆ సినీతారను కలుసుకోవటానికా?"

శ్రీవారు సిద్ధునిలా నవ్వారు. "రెంటికీ!" అంటూ.

వారంరోజుల తర్వాత శేఖర్ వచ్చాడు. కానీ వెళ్తున్న రోజు అతగాడిముఖంలో కనిపించిన మెరుపు ఈరోజు లేదు.

"ఏం తమ్ముడూ! అలావున్నావ్!" అనడిగాను రెండు మూడుమార్లు.

"ఏంలేదక్కయ్యా! బాగానే వున్నాగా?" అనేశాడు నవ్వటానికి ప్రయత్నిస్తూ, నవ్వురాక అవస్థపడ్తూ.

అస్తమానూ శూన్యంలోకి చూస్తూనో, పిచ్చిగా జుట్టు రేపుకుంటూనో, గాఢంగా నిట్టూర్పులు విడుస్తూనో వుంటు న్నాడు శేఖర్, ఎన్నిమార్లడిగినా "ఏంలేదక్కయ్యా!" అనే సమాధానం మినహా మరేం రావటంలేదు అతగాడి నోటినుంచి.

నాకు అనుమానంగానే వుంది! మద్రాస్‌లో ఏదో జరిగింది. అది దాస్తున్నాడు తమ్ముడు!

గట్టిగా కోప్పడ్డాను. "తమ్ముడూ! అదేం కుదరదు! అసలేమయ్యిందో నాతో చెప్పు! నాతో చెప్పుకోవటానికి సిగ్గుగావుంటే మీ బావగారితో చెప్పు! అదీకాదంటావ్? ఈ రోజే బాబాయిగారికి ఉత్తరం వ్రాసేస్తాను! ఆయనగారు వచ్చాక, ఆయనగారికే చెబుదూగానీ!"

అన్నానేగానీ నాకే ఎబ్బెట్టుగా తోచింది నా కంఠ స్వరం. శేఖర్ నా స్వంత తమ్ముడు కాదు. అతగాణ్ణిలా నిల దియ్యాల్సిన అవసరమూ, హక్కూ నాకేమున్నాయిగనుక?

అంతలోనే ఆ ఆలోచనకు స్వస్తి చెప్పాను. స్వంత తమ్ముడయినా కాకున్నా, శేఖర్‌ను నా తోబుట్టువులా, వాత్సల్యంగా చేరదీసాను. అతగాడి బాగోగులు నావిగాక మరెవ్వరివి?

బాబాయిగారి పేరు వినగానే పిల్లిలా అయిపోయాడు శేఖర్.

"అక్కయ్యా! నీకో నమస్కారం పెడతాను. నాన్న గారి కీసంగతు లేవీ చెప్పకు!"

తర్వాత శేఖర్ మెల్లిగా కొద్దికొద్దిగా చెప్పిన సారాంశం ఇది. కాస్త ఊహలు చేరిస్తే, తమ్ముడి ప్రణయం తాలూకు కథ పూర్తయ్యింది! ఆ కథ ఇది.

* * *

శేఖర్ తారకుఉత్తరాలు వ్రాయటం, ఆవిడదగ్గర్నుంచి జవాబులు రావటం జరిగిపోతోంది.

ఒక్కోసారి ఆవిడ దగ్గర్నుంచి జవాబురాకున్నా తను మాత్రం ఉత్తరాలు వ్రాయటం మానలేదు శేఖర్. అంతటితో ఆగక తారను తన 'హృదయపీఠంమీద దేవతగా ప్రతిష్ఠించాడు. ఆరాధించటమూ ప్రారంభించాడు. చివరకు కళ్ళు తెరచినా, మూసినా తారే కన్పించటం మొదలెట్టింది. ఇక ఆవిడలేక క్షణం తను బ్రతకలేననుకున్నాడు. అంచేత తెగించి తారకిలా వుత్తరం వ్రాచాడు.

"నా ప్రియతారా, హృదయ సితారా!

నిన్ను విడిచి క్షణంసేపు నిలువలేనిస్థితిలో వున్నాను. నువ్వు నటించిన సినిమాలు కనీసం పదిమార్లు చూస్తున్నాను. అయినా నా హృదయంలోని జ్వాల చల్లారటం లేదు నీవులేని నా జీవితం వ్యర్థం! నీతోడిదే నాలోకం! అరడుగులు పైగానే

పాడవుగా వుంటాను నేను ! నిన్నుతప్ప మరెవ్వర్నీ పెళ్ళాడను. నువ్వు తిరస్కరిస్తే ఉరేసుక చచ్చిపోతాను. ఆ పాపం నీకే !

నీ
"శేఖర్"

వారంరోజుల్లో ఆ జాబుకు జవాబు వచ్చింది.

"మీరొకసారి నాతో ముఖాముఖిగా మాట్లాడగోరు తాను !

"తార"

ఆ ఒక్క ముక్కా, శేఖర్‌ను ఆనందడోలికల్లో ఊపిరాడకుండా ఊపివేసింది ! తన ప్లాన్ ఫలించింది. తను నిజంగానే ఆత్మహత్య చేసుకుంటాడేమోనన్న భయంతో తార తనను పెళ్ళాడ్డానికి అంగీకరిస్తుంది. ఓహ్ ! ఆరోజు రాత్రి శేఖర్ కిక నిద్ర పట్టలేదు. కళ్ళుమూసుకుని ప్రక్కమీద పడుకుని కమ్మని కలల్లాటి ఎన్నో దృశ్యాల నతగాడు మనో నేత్రాలతో టెక్నికలర్ ఫిల్ములా చూచాడు.

తనూ, తారా రోల్సురాయిస్‌లో తారురోడ్ల మీద మెత్తగా వెడుతున్నారు. ఎక్కడికో ? తార అభిమానులంతా కారుచుట్టూరా చుట్టుముట్టారు. "అరుగో వారే శ్రీ శేఖర్ గారు ! తార భర్త ! ఓహ్ ఏం పర్సనాలిటీ ? ఏం చక్కా ఈడూజోడూ, అందం, చందం సరిపోయాయి !" గుసగుసలుగా తమ చుట్టూరా గొంతుకలు వినిపిస్తుంటే, గర్వంతో శేఖర్ ఛాతీ అరంగుళం సాగింది.

ఎలాగో ఆటోగ్రాఫుల గొడవనుంచి తప్పించుక బయటపడ్డారు తనూ, తార కారు వెళ్తోంది జోరుగా,

"మీరు సినిమాలలో చేరరాదూ? మీతోతప్ప మరెవరితోనూ నటించననే నియమం పెట్టుకుటాను!" తార తన కళ్ళలోకిచూస్తూ, మెత్తగా నవ్వుతూ, గోముగా అంటోంది :

"అలాగే! నీకోరిక తీర్చడంకంటే నాకింకేం కావాలి దేవీ?" హీరో ప్రేయసిని లాలించి. సప్తసముద్రాలనూ లంఘించబోతున్నట్లుంది తన కంఠస్వరం తనకే గంభీరంగా!

"నాపేరు 'దేవి' కాదు 'తార'"

తార కిలకిల నవ్వుతోంది. తనకు గిలిగింతలు పెట్టినట్లువు తోంది!

అయితే అంత చక్కటి కలా, క్షణంలో చెదరిపోయింది 'అలారం' టైంపీస్ గొడవతో.

కానీ ఆకల నిజమైతీరుతుందన్న భావనమాత్రం శేఖర్ హృదయంలో బలంగా నాటుకుంది.

ఎలాగో 'కల్చరల్ టూర్' ఒకటుంది! ఒకేసారి రెండు పిట్టలన్నట్లు తారను కల్సుకుని, ఆమెను పెళ్ళాడడమూ జరిగి పోతుంది! ఆతర్వాత ఓపికుంటే బి. ఎస్. సి. పూర్తి చెయ్యొచ్చు. లేకుంటే లేదు! ఛీ! ఇప్పుడు సినీతారల భర్తలందరికి ఏం పెద్ద డిగ్రీలు ఏడ్చాయి? సినిమా హీరోలకు మాత్రం డిగ్రీలుండాలనే నియమమేముంది గనుక?

అందుకే కాస్త అటూ ఇటూగా అయినా ఫర్వాలేదని "కలనిజమాయెగా! కోరిక తీరెగా!" అని ఈలపాట కూడా పాడేశాడు.

మద్రాస్ చేరాక స్నేహితుల్ని తప్పించుక తార ఇంటికి వెళ్ళాడు.

తార సమయానికి వరండాలోకి రాబట్టి సరిపోయింది గానీ, లేకుంటే గూర్ఖానో. ఆల్సేషియన్ డాగో శేఖర్ని క్షణంలో నమిలి మింగేసేవారే !

“ఎవరు ?” అంది తార తీక్షణంగా శేఖర్ వేపు చూస్తూ, దేవతా వస్త్రాల్లో మెరిసిపోతూ !

“నేనండీ ! శేఖర్ని !” పది నిముషాలు మాటలకోసం తడుముకుని, తార బంగళాలోని పనిమనుషులంతా పోగయి నవ్వుతుంటే, తనెవరో తనకే గుర్తురాక తికమకపడి, చివర కెలాగో తెగించి చెప్పాడు.

“ఓ! మీరా? రాండీ!” గుర్తుపట్టి, సాదరంగా ఆహ్వానించి మేడమీదకు పిల్చుకెళ్ళింది తార.

ఆమె వెంట వెళ్తూ, ఇంద్రభవనం లాటి ఆ బంగళాను చూస్తూ శేఖర్ ఊహావిహంగాలు స్వేచ్ఛగా ఎగిరాయి! మరి కొద్దిరోజుల్లో తనీ బంగళాకు మకుటంలేని మహారాజు కాబోతున్నాడు ! తన అవస్థచూచి ఇందాక నవ్వుకున్న పనివెధవలందర్నీ డిస్మిస్ చేసి, మాంఛీ ‘డీసెంట్ సర్వెంట్సు’ను పెట్టాలి. అదీ ముందు పని !

“కూర్చోండి !” సోఫా చూపింది తార.

కాస్సేపట్లో నౌకరు కుర్రాడు ట్రేలో పళ్ళూ, ఓవల్ టీన్ పట్టుకొచ్చాడు.

"వద్దండీ !" సిగ్గుపడ్డాడు శేఖర్ 'కుంచించుకపోతూ.

"పర్వాలేదు. తీసుకోండి !" తార శేఖర్ ప్రక్కనే కూర్చుంది సోఫాలో ! కోటి మల్లెలు, గులాబీలు, సంపెంగలు మరేవేవో ప్రపంచంలోని అతిచక్కటి పరిమళ పుష్పాలన్నీ తన దగ్గిరే రాసిపోయబడి, వాటన్నిటి దివ్యసౌరభం ఉక్కిరి బిక్కిరి చేస్తున్నట్లనిపించింది శేఖర్‌కు !

ఓవల్‌టిన్ కప్పు శేఖర్ కందిస్తూ "అన్నట్లు మీరు నా గురించి ఆత్మహత్య చేసుకుంటామన్నారు కదూ?" అంది సూటిగా శేఖర్ కళ్ళలోకి చూస్తూ !

అలా అంతసూటిగా ప్రశ్నిస్తుందనుకోలేదు. ఏం చెప్పాలో తోచలేదు క్షణకాలం...అతగాడికి ఒకటిమాత్రం తెలుస్తోంది ! తార చూపు తన హృదయాంతరాళాల్లోకి చొచ్చుకుపోయి, ఏదో కంపనను రేపుతోంది !

"నేనెంతగా గాభరాపడిపోయా ననుకున్నారూ ! మీ జాబు చదివి ? నిజంగా మీరు వ్రాసినట్లు ఆ పాపం నాకూ తగులుకోవచ్చు... అందుకే వెంటనే రమ్మని జాబు వ్రాసేసాను !"

శేఖర్ హృదయం కాస్త కుదుటబడింది.

ఇంతదూరం వచ్చాక మిమ్మల్ని 'మీరు' అని కాకుండా 'శేఖర్' అంటాను చనువుగా! మీ కేం అభ్యంతరం లేదుగా?"

జన్మ తరిస్తోం దనిపించింది శేఖర్‌కు.

"అలాగే !" అన్నాడు.

"అన్నట్లు శేఖర్ ! నీ కుటుంబం, ఆస్తిపాస్తులూ వగైరా వివరాలు కాస్త చెప్పగలవా ?" తార మృదువుగా అడుగుతోంది !

తన గమ్యం మరెంతో దూరం లేదు! హుషారొచ్చింది శేఖర్‌కు ! అందాకా కొద్దిగా కంపిస్తున్న శరీరం సర్దుకుంది.

"చెబుతాను! మా అమ్మా నాన్నగార్లకు నేనొక్కణ్ణే కొడుకును. మరో ఇద్దరు చెల్లెళ్ళున్నారు నాకు. మాకో పాతిక ఎకరాల మాగాణ్, ఓ పెద్ద ఇల్లూ వున్నాయి గ్రామంలో !"

మరి నీ వయస్సు...?'' తార మధ్యలో ప్రశ్నించింది!

"ఇరవై మూడు...'' సిగ్గుపడ్డాడు శేఖర్ ! తను ఇరవై ఏడు సంవత్సరాల వాడిలా కన్పిస్తున్నాడు కాబోలనుకుని !

''అన్నీ నిజాలే చెప్పినందుకు చాలా సంతోషం!''తార కృతజ్ఞతాపూర్వకంగా చూచింది ! అలా చూస్తుంటే, తార ముఖంమీద పౌడర్ పూ తమాటున మొటిమల తాలూకు మిట్ట పల్లాలు, ముడుతలూ స్పష్టంగా కన్పిస్తున్నాయి వెగటుగా !

"మరి నాకూ స్పష్టంగా కన్పిస్తున్నాయి వెగటుగా !

"మరి నాకూ నా భర్తను ఎన్నుకునే స్వాతంత్ర్యం హక్కూ వున్నాయనే సంగతి నీకు తెలుసుగా శేఖర్ ?''

ఎంత మృదువుగా అడిగినా కొద్దిగా కటువుగా ధ్వనించింది తార గొంతు !

"తప్పకుండా !" అన్నాడు శేఖర్.

"మరి నీలో ఏం క్వాలిఫికేషన్ చూచి నన్ను పెళ్ళాడమంటావ్ ?"

ఏదో పెద్ద బ్రహ్మాండభాండం బ్రద్దలైనట్లు ఫీలయ్యాడు శేఖర్ !

"నా ఒక్క పిక్చర్‌కు నేను సంపాదించే డబ్బులో మూడోవంతు ఆస్తి నీకు లేదు ! వయస్సా పాతికలోపే ! దారుఢ్యం అంతంతమాత్రంగానే వుందాయె, వర హీనం అయ్యేలా ! ఇవి చాలవన్నట్లు అమ్మ, నాన్న, ఇద్దరు చెల్లెళ్ళు వగైరా బాదరబందీలూ !"

కిలకిల నవ్వుతోంది తార !

ఇదేమిటి? ఈవిడిలా మాట్లాడ్తోంది ?

"నువ్వు నమ్ముతావో లేదో, నా వయస్సు ఇప్పుడు పద్దెనిమిది !" అంది తార అలాగే నవ్వుతూ,

ఎగిరి గంతెయ్యబోయాడు శేఖర్ ! 'మరింకేం ? వర హీనం ఎలా ఔతుంది ?' అనబోయాడు...

"పదిహేను సంవత్సరాల క్రితం నావయస్సు పద్దెనిమిది. మరో పదిహేను సంవత్సరాలు పోయాకకూడా నా వయస్సు అంతే !"

ఏదో వేదాంతం వింటున్నట్లుగా వుంది శేఖర్‌కు అయోమయంగా !

"బహుశా నేనిలా సినిమాలలో చేరకుండా, సకాలంలో పెళ్ళిచేసుకునివుంటే, నీ వయసుగల నాలుగో కొడుకుండే వాడేమో !" బొత్తుగా తల బ్రద్దలుకొడ్తున్నట్లుంది శేఖర్‌కు ! తార మాట్లాడే మాటలు కొద్దిగా అర్థమవుతున్నాయ్ ! మరి కొంత అర్థం కావటంలేదు !

"బహుశా నా మొదటిభర్త, తాళిగట్టిన భర్త కాదనుకో. బ్రతికేవుంటే, నేను శ్రీమతిగా చెలామణీ అయ్యే దాన్ని !" తార అలాగే నవ్వుతోంది.

"మీరు... మీరు... 'కుమారి' కాదా ?" తడబడ్తూ, పెదవులు తడుపుకుంటూ అడిగాడు శేఖర్.

'కుమారి అన్నా శ్రీమతి అన్నా నాకు పోయేదీ, వచ్చేదీ ఏమీ లేదు! నాకు పెళ్ళి అవసరం మాత్రం ఏముంది గనుక ? ఎటొచ్చీ అలాటి అవసరం కలిగినప్పుడు, నా అంతస్తూ, డబ్బూ, వయస్సూ వాలకానికి తగిన పురుషుణ్ణి వివాహం చేసుకుంటాను !

శేఖర్ నిర్విణ్ణుడైనాడు !

హఠాత్తుగా తార శేఖర్ భుజం మీద చెయ్యి వేసింది. మెల్లిగా ఆ చెయ్యి అతగాడి తల మీదకు వెళ్ళి, వాత్సల్య పూరితంగా నిమర సాగింది. ఆస్పర్శ కొత్తగా, ఎలాగో వుంది శేఖర్ కు !

తార ముఖమూ, కంఠస్వరమూ కూడా మారి పోయాయి మరు నిముషంలో !

"తమ్ముడూ ! నీకు వయసు తక్కువ. ఆవేశం ఎక్కువ! నీవే కాదు. నీలాటి చాలమంది యువకులకు యిదే పిచ్చి ! మేమేదో దేవతలమనీ, ఆకాశంలో మెరిసే తారకలమనీ మీ భావం ! అంచేత మమ్మల్ని మీ స్వంతం చేసుకుంటే, మీ జన్మ ధన్యమౌతుందని ఓ భావం !

నన్ను పెళ్ళాడి నువ్వేం సుఖపడ్తావ్? నా వయసు ప్రొద్దు తిరిగి పోయింది. నా శరీరం చూడు. అందరూ చూచి చూచి, అన్ని కోణాల్లోనూ చూచి, ఏహ్యభావంతో తలలు తిప్పుకుంటున్నారు. ఎన్నెన్నో ప్రేమఘట్టాల్లో యీసరికే నలిగిపోయాను.

దాదాపు నీ తల్లి వయస్సు గల నాతో నీ పెళ్ళా? అందుకోసం చదువుమానుకుని వెర్రెత్తి, ఆత్మహత్య చేసుకుంటావా? ఇంత చదువూ చదివి నీకబ్బిన విజ్ఞానం ఇదేనా?

అర్థంలేని ఆలోచనలు చెయ్యక హాయిగా చదువుకో. మీ అమ్మా నాన్నాగార్లు నీ మీద ఎన్నో ఆశలు పెట్టుకుని వున్నారు. వాళ్ళను పోషించి పుణ్యం కట్టుకో. మీ చెల్లాయిలకు పెళ్ళిళ్ళూ వగైరా బాధ్యతలు నిర్వర్తించు.

చక్కగా నీ వయసుకూ, మీ సాంప్రదాయాలకు, మీ పెద్దలకూ అనుగుణమైన అమ్మాయిని పెళ్ళాడు! బురదగుంటలో దూకబోయే ఎలుక పిల్లలా, లేనిపోని పగటి కలలు కనకు!

వెళ్ళు తమ్ముడూ! మరెప్పుడూ, మరెవరితోనూ, ఇలాటి ప్రేమాయణాలు చెయ్యకు. బుద్ధిగా చదువుకో! నీవు ఫస్టుక్లాస్‌లో పాసైనట్లు నాకు వ్రాయి సంతోషిస్తాను...

ఇదో డ్రైవర్! ఈ అబ్బాయిని మనకార్లో అతగాడి బసదగ్గర వదలిరా!"

శేఖర్‌కు పరిసరాలూ, పరిస్థితులూ అర్థమయ్యేసరికి అతగాడు తన మిత్రబృందం బసచేసిన బసకాస్త దూరంలో రోడ్డుమీద నిల్చునివున్నాడు.

—*0*—